క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక


టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన హొళగుంద రజక సంఘం నాయకులు

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర, బహిరంగ సభలను విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరుపాక్షి పిలుపునిచ్చారు. చిప్పగిరిలోని ఆయన నివాసంలో బుధవారం హొళగుంద మండలం కొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ వైస్ సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, భర్త గిరప్పతోపాటు మరో 50 కుటుంబాలకు వారు, రజక సంఘం నాయకులు శంకర్, హనుమంతు, కొండయ్య తదితరులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన వారందరికీ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీఎం జగనన్న చేసిన మంచిని ఇంటింటికీ వెళ్లి వివరించి ఓటు అభ్యర్థించాలని సూచించారు. నాయకులు షఫీఉల్లా, దొడ్డబసప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

చిప్పగిరి: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఏరూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి జయరాంనాయక్ తెలిపారు. ఆయన బుధవారం ఏరూరు గ్రామ సచివాలయంలో మాట్లాడుతూ.. గ్రామంలోని కుంటను హంద్రీ నీవా నీటితో నింపినట్లు చెప్పారు. కుంటలోని నీరు ఏడాదిపాటు గ్రామస్తుల అవసరాలకు సరిపోతుందని సర్పంచ్ తిమ్మాపురం వెంకట లక్ష్మి తెలిపారు. అలాగే గ్రామంలోని చేతి పంపులన్నీ మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. ప్రభుత్వ ముందస్తు చర్యలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డెంగీ కేసు నమోదు

గోనెగండ్ల: మండల పరిధిలోని అలువాల గ్రామంలో 9 నెలల బాలుడికి డెంగీ నిర్ధారణ అయినట్లు డివిజన్ మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. దీంతో బుధవారం వైద్య సిబ్బంది అలువాల గ్రామంలో ఇంటి పరిసరాల్లో పర్యటించి నీరు నిల్వ ఉన్న చోటశుభ్రం చేయించి, దోమల మందును పిచికారీ చేయించారు. ఆయన మాట్లాడుతూ.. బాధిత బాలుడు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించామన్నారు. సూపర్‌వైజర్లు సుధాకర్, రవి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కోడ్ తప్పనిసరిగా పాటించాలి

ఆలూరు రూరల్: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించాలని ఆలూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి రామునాయక్ సూచించారు. ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల వాహనాలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, మైక్‌ల కోసం 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలన్నారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డీటీ రజనీకాంత్ రెడ్డి, ఎన్నికల డీటీ గుండాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను సంరక్షించుకుందాం


మాట్లాడుతున్న సీడీపీఓ సఫరున్నీషా బేగం

నందవరం: ఆడపిల్లలను సంరక్షించుకుందామని సీడీపీఓ సఫరున్నీషా బేగం సూచించారు. ఆమె బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీలేఖ ఆధ్వర్యంలో బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ నేతృత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ పోలీసులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు, అనంతరం కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు బాలికల సంరక్షణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ.. కుమారులతో పాటు కూతుళ్లను సమానంగా పెంచేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని వివరించారు. ఆడపిల్లల చదువు ఆవశ్యకతను వివరించారు. బాలికల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ వంటి అంశాలను వివరించారు. వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, సీహెచ్‌ఓ బలరాం, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుచరిత, సుధావతి, హెల్త్, వైకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బాల్యవివాహాలు అరికట్టాలి

మద్దికెర: బాలికలకు యుక్త వయసు రాకముందే పెళ్లిళ్లు చేసి వారి జీవితాలు నాశనం చేయవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రిదేవి సూచించారు. బుధవారం స్థానిక కస్తూర్బా విద్యాలయం బాలికలతో బేటీ బచావో -బేటీ పడావో అంటూ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. లింగ వివక్ష నిర్మూలించాలని, బాలికలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. భ్రూణ హత్యలు అరికట్టాలన్నారు. ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథం.. అభివృద్ధి ఘనం

- స్వర్ణయుగంలా వైఎస్సార్‌సీపీ పాలన
- వ్యవసాయానికి ఊతం.. చేనేతకు చేయూత
- సంక్షేమ పథకాలతో ఎమ్మిగనూరుకు రూ.650 కోట్ల లబ్ధి
- ఈనెల 29న ఎమ్మిగనూరుకు సీఎం రాక


గ్రామ స్వరాజ్యానికి నాంది.. గ్రామ సచివాలయం


జల సిరులు.. గాజులదిన్నె ప్రాజెక్టుకు ఆధునిక హంగులు


బంధాలకు వారధి.. నాగలదిన్నె బ్రిడ్జి నిర్మాణం


ఆరోగ్యమస్తు.. అర్బన్ హెల్త్ సెంటర్ నూతన భవనం

ఎమ్మిగనూరు: జననేత జగన్‌మోహన్‌రెడ్డి నాలుగన్నరేళ్ల పాలన జనామోదయోగ్యమైంది. ఇచ్చిన హామీలు-ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీతగా భావించి జన సంక్షేమ క్యాలెండర్‌ను రూపొందించి అమలుపర్చడం దేశ చరిత్రలోనే నూతన అధ్యాయం. కరోనా కష్టాలు వెన్నాడినా.. గత పాలకుల పాపాలు అడ్డంకులుగా ఉన్నా.. విభజనాంధ్రాను లోటుబడ్జెట్ వెక్కిరిస్తున్నా.. వ్యవస్థలను మేనేజ్ చేసే కుటిల రాజకీయ కుట్రలను సైతం చిరునవ్వుతో స్వీకరిస్తూ అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పాలనను కొనసాగించడం జననేతకే సాధ్యమేమో అన్నట్లు ముందడుగు వేస్తూ 58 నెలలు దాటడం గర్హనీయం.

వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ.. పేదలకు 'పట్టా'ం కడుతూ.. విద్యారంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టి.. మెరుగైన వైద్య సేవలకు బాటలు వేస్తూ నిత్యం పేదల పక్షాన నిలవడం, వారి గురించే ఆలోచించడం జననేత పాలనలో కీలకమయ్యాయి. చేనేతకు చేయూతనిస్తూ.. జీవనోపాధి మార్గాలను పెంపొందిస్తూ ప్రతి ఇంటా సంక్షేమ గంట మోగిస్తూ.. అభివృద్ధి అజెండాతో ముందుకుపోతున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన మరో పాతికేళ్లైనా కొనసాగాలని కోరుకునే జనం ఆశలు.. ఆకాంక్షలు మరింత ప్రబలమయ్యాయి. 'మేమంతా సిద్ధం' కార్యక్రమంలో భాగంగా ఈనెల 29న ఎమ్మిగనూరుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా 'సంక్షేమ-అభివృద్ధి' పాలనను మననం చేసుకుంటే..

ఉద్యోగాల విప్లవం

వైఎస్ జగనన్న పాలనలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడ్డాయి. ఆయన ఆలోచనల్లో పుట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ఉద్యోగాల విప్లవం వచ్చింది. నియోజకవర్గంలో 91 సచివాలయాలు ఏర్పాటు చేసి వాటిలో 753 మందికి ఉద్యోగాలు కల్పించారు. అలాగే సంక్షేమ పథకాల సేవకులుగా గుర్తింపు పొందిన వలంటీర్లను నియోజకవర్గంలో 1325 మందిని నియమించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి శిక్షణ ఇచ్చి 2500 మంది ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందేలా చేశారు. 98 డీఎస్సీ ద్వారా ఎంపికైన వారిని ఉపాధ్యాయులుగా నియమించారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.18,500కు పెంచడం, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, పొదుపు సంఘాల బుక్‌కీపర్ల వేతనాలు పెంచడం విశేషం. కాంట్రాక్ట్ లెక్చరర్లకు జీతాలు పెంచి భరోసా కల్పించారు.

అభివృద్ధికి అందలం

నియోజకవర్గంలో రూ.57.37 కోట్లతో గాజులదిన్నె ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేపట్టారు. హంద్రీ-నీవా నుంచి 3 టీఎంసీల నీటిని గాజులదిన్నె ప్రాజెక్టుకు మళ్లించే పనులు జరిగాయి. రూ.8.5 కోట్లతో అసంపూర్తిగా ఉన్న నాగులదిన్నె బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. రూ.12.60 కోట్లతో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఆధునికీకరణ పనులు, రూ.1.6 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం జరిగింది. రూ.12.64 కోట్లతో 55 హెల్త్ క్లినిక్‌లు, రూ.15.32 కోట్లతో 64 రైతుభరోసా కేంద్రాలు, రూ.39.67 కోట్లతో 91 సచివాలయాల నిర్మాణం చేపట్టారు. నాడు-నేడు పనుల ద్వారా మొదటి విడతలో రూ.25.21 కోట్లతో 74 పాఠశాలలను, రెండవ విడతలో రూ.66.5 కోట్లతో 111 ప్రభుత్వ పాఠశాలలను కొత్తగా నిర్మించి రూపురేఖలే మార్చారు. అదేవిధంగా రూ.13.75 కోట్లతో ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల ఆధునికీకరణ చేపట్టారు. పట్టణ ప్రజలకు తాగునీటి కోసం గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా కోసం ఏఐఐబీ పథకం ద్వారా రూ.144 కోట్లతో పనులు జరుగుతున్నాయి. రూ.65 కోట్లతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో రోడ్ల నిర్మాణం జరిగింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో రూ.40 లక్షల వరకు అభివృద్ధి పనులు జరిగాయి.

జగనన్న ఇచ్చిన వరం



మాలాంటి నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాలు ఇచ్చారు. జగనన్న కాలనీ ద్వారా నా సొంతింటి కల తీరింది. ఉండటానికే దిక్కులేని మాకు బళ్లారి-రాయచూరు హైవే రోడ్డు పక్కనే జగనన్న కాలనీ ఏర్పాటుచేసి ఇళ్లు నిర్మించడం మా అదృష్టం. గృహప్రవేశం చేసి సొంతింట్లో ఆనందంగా జీవిస్తున్నాం.

– ఏ జయమ్మ, బోడబండ, ఎమ్మిగనూరు మండలం

రూ.1.20 లక్షల సాయం



మగ్గం బతుకులు దుర్భరమైన సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేనేతలకు దేవుడయ్యారు. నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24 వేలు చొప్పున నాకు ఐదేళ్లలో రూ.1.20 లక్షల సాయం అందింది. కరోనా కాలంలో జగనన్న సాయం లేకుంటే మా బతుకులు దుర్భరమయ్యేవి. మేము చేనేత కార్మికులం అని గర్వంగా చెప్పుకొనే పరిస్థితిని జగన్ కల్పించారు.

– టి.లక్ష్మి, నాగలదిన్నె

పేదల పక్షపాతి వైఎస్ జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి. ఒక్క ఎమ్మిగనూరు నియోజకవర్గంలోనే వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.650 కోట్లకుపైగా నిధులను పేదల అకౌంట్లలో జమచేయడంతో జననేతకు పేదలపట్ల ఉన్న నిబద్ధత తెలుస్తోంది. ఎల్లెల్సీ రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా, గాజులదిన్నె ప్రాజెక్టును ఆధునికీకరణ చేపట్టి సాగు, తాగునీటి అవసరాలను తీర్చారు. గంజహళ్లి – తెర్నేకల్ మధ్య బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న నాగలదిన్నె బ్రిడ్జిని పూర్తి చేసిన ఘనత వైఎస్ జగనన్నదే.

– బుట్టా రేణుక, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలు

పథకం పేరు	లబ్ధిదారులు	లబ్ధి పొందిన మొత్తం (రూ.కోట్లలో)
జగనన్న అమ్మఒడి	39,066	178.25
జగనన్న విద్యాదీవెన	20,233	53.80
జగనన్న వసతి దీవెన	15,421	23.45
జగనన్న విదేశీ విద్యాదీవెన	150	0.71
వైఎస్సార్ రైతు భరోసా	43,733	212.04
డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా	42,049	103.13
వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు	12,853	145.03
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	1454	1.13
వైఎస్సార్ మత్స్యకార భరోసా	542	4.85
వైఎస్సార్ పెన్షన్ కానుక	40,357	375.83
వైఎస్సార్ చేయూత	19,400	93.62
వైఎస్సార్ ఆసరా	33,433	68.30
వైఎస్సార్ సున్నా వడ్డీ (పొదుపు)	59,855	17.47
వైఎస్సార్ కాపునేస్తం	66	7.10
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	685	14.01
వైఎస్సార్ కళ్యాణమస్తు	189	1.02
డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	14,257	50.52
డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	7071	4.84
హౌసింగ్ లబ్ధిదారులకు నేరుగా చెల్లింపు	4295	76.43
వైఎస్సార్ బీమా	661	0.62
వైఎస్సార్ వాహనమిత్ర	1212	3.25
వైఎస్సార్ నేతన్న నేస్తం	2484	29.80
జగనన్న చేదోడు	2144	3.50
వైట్‌కార్డు హోల్డర్స్ ప్రత్యేక కోవిడ్ సాయం	61,514	5.81
జగనన్న తోడు (వడ్డీ)	3,150	43.12

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎన్నికల ఆర్‌ఓ చిరంజీవి

ఎమ్మిగనూరురూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) చిరంజీవి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌ఓ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల ప్రచారంలో వాహనాలు, మైక్‌లకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. సువేదా యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే 48 గంటల్లో అనుమతి మంజూరు చేస్తామని తెలిపారు. అనుమతి లేకుండా ప్రచారంలో వాహనాలను తిప్పితే సీజ్ చేస్తామన్నారు. ఆయా పార్టీల ప్రచారాల్లో ఉద్యోగులు, వలంటీర్లు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసేవారు పాల్గొంటే తమ దృష్టికి సాక్ష్యాలతో తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయా పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు. తహసీల్దార్ శేషారెడ్డి, ఎన్నికల డీటీ రఘువీరా, ఆయా పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చేరికలపై టీడీపీ చిత్రవిచిత్రాలు


బొమ్మన రవిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వార్డు మెంబర్ సురేశ్


వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలో టీడీపీ నాయకుల రాజకీయం చిత్రవిచిత్రంగా అనిపిస్తోంది. ఈనెల 24 నుంచి టీడీపీ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబు వెల్దుర్తి మండలంలో నాయకులు బలరాం గౌడ్, శంకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఎల్‌ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్‌తో కలిసి ప్రచారం ప్రారంభించారు. ప్రారంభానికి ముందు కొందరు, ప్రచారం సాగుతుండగా మరికొందరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరినట్లు కండువాలు కప్పేస్తున్నారు. వీరిలో 90 శాతానికిపైగా టీడీపీ కార్యకర్తలే కావడం విశేషం. ఇదిలా ఉండగా బుధవారం వెల్దుర్తి 5వ వార్డు మెంబర్ వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు సురేశ్‌కు టీడీపీ నేత ఎల్‌ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్ స్వగృహంలో ఆ పార్టీ కండువా కప్పేశారు. ఇది జరిగిన గంటలోపే సురేశ్ వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకుని పార్టీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి ఆధ్వర్యంలో తిరిగి వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. అనాలోచితంగా, మిత్రుల ప్రోద్బలంతో టీడీపీ కండువా కప్పించుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఏదేమైనా స్థానిక టీడీపీ నాయకులు తమ ఇన్‌చార్జ్ మెప్పు కోసం చేస్తున్న విచిత్ర రాజకీయం టీడీపీ గ్రాఫ్ తగ్గిస్తున్నట్లుగా ఏకంగా హైకమాండ్ గుర్తించి ఛీవాట్లు పెట్టినట్లు సైతం తెలుస్తోంది. ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఫారం దక్కేవరకు గ్రాఫ్ పడిపోకుండా కాపాడుకోవాలంటూ మొట్టినట్లు సమాచారం.

రమణీయం.. శ్రీరంగనాథుడి రథోత్సవం


జనవాహిని మధ్య శ్రీరంగనాథుడి రథోత్సవం, (ఇన్‌సెట్) స్వామివారి కల్యాణోత్సవం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య శ్రీరంగనాథుడి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారి సతీ సమేత ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, సహస్ర అష్టోత్తర నామం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపానికి పుష్పాలంకరణ, కల్యాణోత్సవానికి దాతలు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ బహుకరించగా నర్సప్ప ఆచారి మంగళ సూత్రాలు సమర్పించారు. పండితుల వేదమంత్రాల సాక్షిగా శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవిల కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో కనులపండువగా నిర్వహించారు. సాయంత్రం వేదమంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో ఊరేగించి రథంపై కొలువుంచారు. రథం ముందు హోమం కాల్చిన అనంతరం అశేష జనవాహిని గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. కనులపండువగా రథోత్సవం సాగింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మద్దికెర పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామస్తులేగాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇవి కనిపించవా?


టీడీపీ నాయకుల పేర్లతో ఉన్న బెంచీలు

ఆలూరు: ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలు, చిత్రాలు, ప్రకటనలు కనిపించకుండా అధికారులు ముసుగు వేస్తున్నారు. ఇప్పటికే బ్యానర్లు, ఫెక్సీలను తొలగించారు. అయితే ఆలూరు ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో టీడీపీ మద్దతు సర్పంచ్ రుక్మిణి, హత్తిబెళగళ్ మాజీ సర్పంచ్ తలారి మహేశ్వరి ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు వారి పేర్లతో పాటుగా పార్టీని ప్రతిబింబించేలా పసుపు రంగులో ఉన్నాయి. బహిరంగ ప్రదేశంలో ఉన్న బెంచీలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారులకు ఇవి కనపడవా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పార్టీ విజయానికి కృషి

వెల్దుర్తి(కృష్ణగిరి): సార్వత్రిక ఎన్నికల్లో గ్రామస్తురాలైన కంగాటి శ్రీదేవిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెరుకులపాడు గ్రామస్తులు స్పష్టం చేశారు. బుధవారం వెల్దుర్తి వైస్ ఎంపీపీ బత్తిన రాజేశ్వరి, మాజీ సర్పంచ్ గడ్డం సోమన్న ఆధ్వర్యంలో గ్రామస్తులు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామంలో సమస్యలేమీ లేవని, అభివృద్ధిలో ముందున్నామన్నారు. ఎన్నికల సమయంలో కొందరు అలజడులు, ఇతరత్రా సమస్యలు సృష్టించేందుకు చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ అందించిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పట్ల గర్వపడుతున్నామన్నారు. నాయకులు పవన్‌కుమార్, బండారు లింగన్న, రంగడు, సత్యాలు, చిన్న వెంకటన్న, నాగభూషి తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు 85 శాతం పూర్తి

చిప్పగిరి: మండలంలో పన్నుల వసూళ్లు 85 శాతం పూర్తయినట్లు ఈఓపీఆర్డీ బాలన్న తెలిపారు. బుధవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో ఇంటి, కుళాయి, వాణిజ్య సముదాయాలు తదితర వాటికి సంబంధించి పన్నులు వసూలు చేసి రిసిప్ట్‌లను ప్రజలకు అందించారు. ఇప్పటివరకు అన్ని రకాల పన్నులు మొత్తం కలిపి రూ.10,70,938 వసూలు కాగా ఈ మొత్తాన్ని ట్రెజరీకి జమ చేసినట్లు తెలిపారు. ఈ నెలాఖరు కల్లా వంద శాతం పన్ను వసూలు చేస్తామన్నారు. ప్రజలు పన్ను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కేజీబీవీ తనిఖీ

చిప్పగిరి: కేజీబీవీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని జీసీడీఓ సునీత ఆదేశించారు. ఆమె బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, అందిస్తున్న భోజనం తదితర వాటి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ తప్పక పాటించాలని ఆదేశించారు. ఎస్‌ఓ సౌజన్య, సిబ్బంది ఉన్నారు.

11 వరకు ఎల్లెల్సీకి నీరు

హొళగుంద: కర్ణాటకలోని టీబీ డ్యాం నుంచి తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు నీటి విడుదలను ఏప్రిల్ 11 వరకు కొనసాగించనున్నట్లు సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, తుంగభద్ర రైతు సంఘం నాయకుడు తప్పెట రామిరెడ్డి బుధవారం తెలిపారు. టీబీ బోర్డు అధికారులు ఏప్రిల్ 5 వరకు నీటిని విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని అయితే జిల్లా ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరికొద్ది రోజులు పొడిగించాలని కోరగా సానుకూలంగా స్పందించి గడువు పెంచినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా బుధవారం టీబీ డ్యాంలో 1581.32 అడుగుల మేర 5.148 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ఇన్‌ఫ్లో జీరో, అవుట్ ఫ్లో 911 క్యూసెక్కులున్నట్లు అధికారులు తెలిపారు. ఎల్లెల్సీ ఏపీ బార్డర్ 250 కి.మీ వద్ద 480 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

30న బెల్లం వేలంపాట

పత్తికొండ రూరల్: పత్తికొండ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలో 7 కేసుల్లో నాటుసారా తయారీకి తరలిస్తుండగా పట్టుబడిన 17 వేల కిలోల బెల్లంను ఈ నెల 30న బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ స్వర్ణలత బుధవారం తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ ఉన్న వ్యాపారులు లైసెన్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని తీసుకొచ్చి రూ.20 వేలు డిపాజిట్ (రిఫండబుల్) చెల్లించి స్టేషన్ ఆవరణలో 10.30 గంటలకు జరిగే వేలంలో పాల్గొనవచ్చన్నారు.

చేనేతలకు చేయూతనిచ్చిన జగనన్న


ఎమ్మిగనూరు 3వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: గత టీడీపీ పాలనలో వృత్తికి దూరమై చితికిపోయిన చేనేతలకు సీఎం వైఎస్ జగనన్న నేతన్న నేస్తం పథకం ద్వారా చేయూతనందించారని, ఆయన రుణం తీర్చుకొనే అవకాశం వచ్చిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పేర్కొన్నారు. చేనేతపురి ఎమ్మిగనూరు 3వ వార్డులో బుధవారం కౌన్సిలర్ స్వాతి, వార్డు ఇన్‌చార్జ్ వినయ్‌తో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలు, వృద్ధులు, చేనేత కార్మికుల యోగక్షేమాలు తెలుసుకుంటూ సీఎం జగనన్న అందించిన పథకాలు వివరించి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ పాలనలో ఏ ఒక్క వర్గం బాగుపడిన దాఖలాలు లేవని రాష్ట్రాన్ని దివాలా తీయించి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ విస్మరించిన ఘన చరిత్ర చంద్రబాబుదే అని ఎద్దేవా చేశారు. టీడీపీ కల్లబొల్లి మాటలు నమ్మక ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. శాప్ నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేశ్వర్లు, పట్టణాధ్యక్షుడు బుట్టా రంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, అధికార ప్రతినిధి సునీల్ కుమార్, నాయకులు వీరేంద్ర, అంపమ్మ, అమాన్, శివప్రసాద్, వాహిద్, రాజారత్నం, సుధాకర్, అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మితే అధోగతే


టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న బీవై రామయ్య, కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: టీడీపీ అధినేత చంద్రబాబు అరచేతిలో స్వర్గం చూపించే రకం అని, సూపర్ సిక్స్ పథకాలంటూ వచ్చే మోసగాళ్లను ప్రజలు నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. కృష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు బుధవారం పత్తికొండలోని ఎమ్మెల్యే స్వగృహంలో వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయించాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు రాబోవు రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి పార్టీలోకి చేరినట్లు గ్రామానికి చెందిన దాసరి హనుమంతు, దత్త, పెద్ద మాధవరావు, ఈడిగ వీరేష్, తెలుగు వెంకటరాముడు, శ్రీనివాసులు, మధు, రేమట గిడ్డయ్య తదితరులు తెలిపారు.

సీఎం సభకు చకచకా ఏర్పాట్లు


ఎమ్మిగనూరులో సిద్ధమవుతున్న సభావేదిక, ర్యాంప్


వైడబ్ల్యూసీఎస్ మైదానంలో బారికేడ్ల ఏర్పాటు

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మిగనూరు వైడబ్ల్యూసీఎస్ మైదానంలో నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' బహిరంగ సభకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. కర్నూలు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి దాదాపు లక్షమందికి పైగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు సభకు తరలిరానున్నారు. సభా వేదికతో పాటు ర్యాంప్, మైదానంలో బారికేడ్ల ఏర్పాట్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. సభా స్థలాన్ని ఇప్పటికే సీఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాంతో పాటు రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, బుట్టారేణుక, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సులో కర్నూలు నుంచి కోడుమూరు, గోనెగండ్ల మీదుగా ఎమ్మిగనూరు శివ సర్కిల్ నుంచి నేరుగా ఆదోని రోడ్డులో వీవర్స్ కాలనీ నుంచి వైడబ్ల్యూసీఎస్ మైదానంలోని సభా వేదికకు చేరుకునేలా పార్టీ నేతలు, పోలీసు ఉన్నతాధికారులు రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. మంత్రులు, జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు భారీగా నాయకులు తరలిరానున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక తెలిపారు.